క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలు, పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చైతన్యరెడ్డి హాజరు కానున్నారని, మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

బీసీల అభ్యున్నతికి కృషి



మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ఎర్రగుంట్ల: బీసీల అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నిడుజివ్వి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ కలిశారు. వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం నియోజకవర్గంలోని రాజకీయ అంశాలపై చర్చించారు.

క్రీడలతో మానసికోల్లాసం

పులివెందుల రూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, దేహ దారుఢ్యానికి దోహదపడుతాయని ఏపీ కార్ల్ సీఈఓ శ్రీనివాసులరెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న ఏపీ కార్ల్‌లో వ్యవసాయ, ఉద్యాన కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం సోమవారం ప్లే గ్రౌండ్ ఏర్పాటు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఆట స్థలం ఏర్పాటులో భాగంగా వ్యవసాయ, ఉద్యాన కళాశాలల ఆవరణంలో ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించామని తెలిపారు. ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేసిన వెంటనే వ్యవసాయ, ఉద్యాన కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉత్తమ సేవకు ప్రశంస



ఉత్తమ సేవా అవార్డును అందుకుంటున్న ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్‌కు ఉత్తమ సేవా అవార్డు అందించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కడప పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్‌కు ఉత్తమ ఎస్‌ఐగా అవార్డు అందించారు. కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా ఎస్‌ఐకి ఈ అవార్డును అందుకున్నారు.

ముద్దనూరు: స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఇజ్రాయిల్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కడపలో ఆయన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ హెడ్‌కానిస్టేబుల్‌గా అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఇజ్రాయిల్‌కు ప్రశంసాపత్రం అందుకోవడంతో పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రిని అందజేస్తున్న గంగాధర్‌రెడ్డి

ముద్దనూరు: మండలంలోని ఓబుళాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు బూచుపల్లె పుల్లారెడ్డి మనుమడు బూచుపల్లె నీహాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, అట్టలు, పెన్నులు, తదితర సామగ్రిని అందిచారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందజేశారు.

కడప 'ఉక్కు' కోసం ఉద్యమం

ముద్దనూరు: విభజన చట్టంలో హామీ మేరకు కడప ఉక్కు కర్మాగారం సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పిలుపునిచ్చారు. విభజన చట్టంలోని హామీల సాధన కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 30, 31తేదీల్లో చేపడుతున్న జీపు జాతాను జయప్రదం చేయాలని కోరారు. సోమవారం ఈ కార్యక్రమానికి సంబంధించి ఆయన కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

పంట చుట్టూ.. చీర కట్టు

అడవి పందుల నుంచి పచ్చని పంటను రక్షించుకొనేందుకు రైతన్నలు ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. మైకుల మోతతో అడవి జంతువులను హడలెత్తించడం, పొలం చుట్టూ చీరలు కట్టడం, రాత్రింబవళ్లు కాపలా ఉండటం, చేను చుట్టూ విద్యుత్తు తీగలు అమరుస్తారు. విద్యుత్ తీగల కారణంగా ప్రమాదవశాత్తు ప్రాణాలు పోతున్నాయని, కరెంట్ పెట్టొద్దని అటు పోలీసులు, ఇటు రైతులు సూచించడంతో కొంతమంది వినూత్నంగా ఆలోచన చేశారు. అడవి పందులు చేనుల్లోకి రాకుండా చేను చుట్టూ పాత చీరలు, మైకులతో వింత శబ్దాలు చేస్తూ భయపెడుతూ పంటను అన్నదాతలు రక్షించుకుంటున్నారు.

- హడలెత్తిస్తున్న అడవి పందులు
- రైతుల వినూత్న ప్రయోగం
- పైరులో మైకుల ఏర్పాటు



కొత్తపల్లె గ్రామ సమీపంలో పంట చుట్టూ కట్టిన చీరలు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు వేరుశనగ, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్క జొన్న పంటలు కోత దశలో ఉండగా, రబీలో సాగుచేసిన వేరుశనగ ప్రారంభ దశలో ఉంది. అయితే ఈ పొలాలు ఎక్కువగా కొండ గుట్టల ప్రాంతంలో ఎక్కువగా ఉండటంతో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. రాత్రివేళల్లో పందులు గుంపులు గుంపులుగా పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి. వేరుశనగ, మొక్కజొన్న, కర్బూజ పంటలను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. విత్తు విత్తినప్పటి నుంచి పంట చేతికొచ్చి మార్కెట్‌కు తరలించే వరకు రైతులకు కంటి మీద కునుకు లేకుండా కాపలా కాస్తున్నారు. దీంతో రైతులు అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి పలు రకాల పద్ధతులను పాటిస్తున్నారు.

పంటను కాపాడుకునేందుకు అగచాట్లు

అడవి పందుల దాడి నుంచి పంట పొలాలను కాపాడుకోవడానికి రైతులు రాత్రి సమయాల్లో కాపు కాస్తున్నారు. అయినప్పటికీ అర్ధరాత్రి గుంపులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేసి పోతున్నాయి. దీంతో పొలం చుట్టూ పాత చీరలు, వలలు, వింత శబ్దాలు చేసే మైకులు, మనుషుల రూపంలో దిష్టి బొమ్మలను ఏర్పాటు చేస్తూ పంటలను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన పంటలు కాపాడుకునేందుకు రాత్రి సమయాల్లో మైకులు ఏర్పాటు చేసుకుని కుక్కల అరుపులు, మనుషులు అరుస్తున్నట్లు శబ్దాలు చేసేలా రూపొందించిన స్పీకర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ మైకులను పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, ఎర్రబల్లె, కొత్తపల్లె, తదితర గ్రామాల్లో రైతులు పంట పొలాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారు. మైకులను రూ.500 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు.



రైతు పొలంలో ఏర్పాటు చేసిన మైకు

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నీసా బేగం

వేంపల్లె : కుష్టు వ్యాధి నిర్మూలనకు లక్ష్యంగా పని చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుమ్మడం, దగ్గడం వలన వచ్చే బ్యాక్టీరియాతో కుష్టు వ్యాధి వ్యాపిస్తుందన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారిన మచ్చలు, కాళ్లు, చేతుల కండరాలు నరాల బలహీనత, నొప్పి లేని పుండ్లు, చేతులు, పాదాలలో పుండ్లు రావడం, కళ్లు పూర్తిగా మూసుకోకపోవడం, చెవి తమ్మెలు మందంగా మారిపోవడం, చర్మంపై, చెవి తమ్మెలుపై బుడిపెలు రావడం అనేది కుష్టు వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో కుష్టు వ్యాధిని గుర్తించేందుకు ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి సర్వేలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనువాసులు రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోరాడితేనే సమస్యల పరిష్కారం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్ కార్మికులు

వేంపల్లె : ఎలక్ట్రికల్ కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ హకీం, మండల శాఖ అధ్యక్షుడు ముని కుమార్ పిలుపునిచ్చారు. ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ సహకారంతో జాతీయ ఎలక్ట్రికల్ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వేంపల్లె ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ అధ్వర్యంలో ఎలక్ట్రికల్ కార్మికులందరూ గ్రామ పురవీధుల గుండా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అలాగే మెయిన్ బజార్‌లోని ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ కార్యాలయం వద్ద సీనియర్ ఎలక్ట్రీషిన్ నాయకుడు జిలాన్, గౌరవ అధ్యక్షుడు హకీంలు కార్మికుల జెండాను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి యస్థాన్, కోశాధికారి బాబా ఫకృద్దీన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ గౌస్, బాబా ఫకృద్దీన్, అహమ్మద్ బాషా, లక్ష్మణరాజు, ముబారక్ బాషా, అల్లాని, నాగిరెడ్డి, రమేష్ బాబు, బాబా తాజ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం: వయోజనులకు అక్షర జ్ఞానం కలిగించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన «ఉల్లాస్» కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జ్యోతి కోరారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, వీఓఏలకు నిర్వహించిన రెండో విడత శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చదువు అంటే చిన్న పిల్లలకు నేర్పినట్లు కాదని, వయోజనులకు అవసరమైన మేరకు అక్షర జ్ఞానం కలిగించాలన్నారు. ముఖ్యంగా వయోజనులు బస్సు ప్రయాణాలు చేసేందుకు, బ్యాంకుల్లో లావాదేవీలు నిర్వహించేందుకు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఫోన్ పే, గూగుల్ పే తదితర వాటి గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య సూపర్ వైజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఏపీఎం గంగాధర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు జయ కుమారి, భారతి, వెంకట సుబ్బమ్మ, అంగన్వాడీ వర్కర్లు, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

ఇ- పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న రమణారెడ్డి

వీరపునాయునిపల్లె: రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంట ఈ పంట నమోదు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రమణారెడ్డి, వ్యవసాయ అధికారి నాగభూషణం రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె, ఎస్. పాలగిరి గ్రామాల్లో ఇ- పంట నమోదు, ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇ- పంట నమోదు చేసుకొన్న రైతుల వివరాలు, సాగు చేసిన పంట వివరాలు తప్పకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను రక్షించుకుందాం



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

జమ్మలమడుగు: ఆడపిల్లను రక్షించుకుని సృష్టిని కాపాడుదామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శంకర్ నర్సింగ్ హోం, సీఎస్‌ఐ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులుగా ఉన్నప్పుడు లింగ నిర్ధారణ చేసి ఆడపిల్లలు అయితే అబార్షన్ చేయడం సరైంది కాదని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా చదవండి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం: ప్రతి విద్యార్థికి టెన్త్ పరీక్షలు ముఖ్యమని ఈ పరీక్షలను ప్రణాళికా బద్ధంగా చదివితే టాపర్లుగా నిలవవచ్చని ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల పదవ తరగతి విద్యార్థినులకు శ్రీపాద శ్రీ వల్లభ అక్షయ సేవా సమితి వితరణ చేసిన ఎస్‌ఎస్‌సీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పరీక్షలకు కేవలం 40 రోజుల వ్యవధి మాత్రమే ఉందని, ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ తులసమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. శ్రీపాద శ్రీవల్లభ అక్షయ సేవా సమితి అధ్యక్షుడు కొండల భరద్వాజ రెడ్డి, మీకోసం విష్ణువర్ధన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సోషల్ ఆడిట్

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని పలు పాఠశాలల్లో పాఠశాల విద్య రాష్ట్ర పరిశీలకులు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఇందులో భాగంగా కడప నగరంలోని చెమ్ముమియాపేట గంగా భవానీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సోషల్ ఆడిట్ టీం ప్రతినిధులు కె. నాగేంద్ర, కె. చిన్నపెద్దయ్యలు పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు పంపిణీ, రిజిష్టర్లు, సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, చేతివృత్తుల శిక్షణను పరిశీలించారు.

శ్రీకృష్ణదేవరాయల కీర్తి.. నేటి తరానికి స్ఫూర్తి

వేంపల్లె : విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు కీర్తి.. నేటి తరానికి స్ఫూర్తి అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతి వేడుకలను వేంపల్లెలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపల్లి బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన చేసిన సమావేశంలో హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగు లెస్స అని కీర్తించిన మహనీయుడని కొనియాడారు. రాయలకాలంలో రాయలసీమ రతనాల సీమగా వెలుగొందిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు రామచంద్రారెడ్డి, లక్ష్మీరెడ్డి, సుమన్, సునీల్ కుమార్, చరణ్ రంగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు

పులివెందుల టౌన్ : పట్టణంలో విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఘనంగా నిర్వహించారు. పులివెందులలోని పూల అంగళ్ల సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి అంకాలమ్మ దేవస్థాన చైర్మన్ తిరుమలశెట్టి నాగేంద్రప్రసాద్, శ్రీరంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శ్రీకృష్ణదేవరాయలు తన పాలనలో ఎన్నో ఆలయాలు కట్టించి దేశ చరిత్రలోనే మైలు రాయిగా నిలవడమేకాకుండా సుపరిపాలన అందించారని గుర్తుచేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారని కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయలు తెలుగుజాతికి స్ఫూర్తి నిలచారని కొనియాడారు. భారతదేశాన్ని పాలించిన చక్రవర్తుల్లో గొప్ప చక్రవర్తిగా, ఆదర్శప్రాయుడుగా ఆయన చరిత్రలో నిలిచారని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయలు అత్యంత ప్రసిద్ధ విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా కీర్తి గడించారని ప్రశంసించారు. అనంతరం శ్రీవీరనారాయణస్వామి అంధుల ఆశ్రమంలో అంధులకు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు కార్తీక్, అంబకపల్లె బాబు, నక్కా విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లె : శ్రీకృష్ణదేవరాయలు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పులివెందుల టౌన్ : శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీరంగనాథస్వామి ట్రస్ట్ చైర్మన్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



గురప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీలు

మైలవరం: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలం పరిధిలోని గురప్పస్వామిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నకొమ్మెర్ల సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి గురప్పకోనలో స్వామికి ముక్కుబడి చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివగురివిరెడ్డి, తలమంచిపట్నం వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికల చదువు సమాజానికి వెలుగు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేంపల్లె : బాలికల చదువు సమాజానికి వెలుగు అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రత్నకుమారి పేర్కొన్నారు. సోమవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన చింతలమడుగుపల్లెలో బాలికల చదువుపై ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్త్రీ విద్యపై, విద్యా హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు విద్యను సాధనంగా చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ డాక్టర్. రవికుమార్, కోఆర్డినేటర్ దీప్తి పాల్గొన్నారు.

క్రీడలు విద్యార్థి జీవితానికి ఉత్తేజం



దీక్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం: క్రీడలు విద్యార్థి జీవితాన్ని ఉత్తేజితం చేస్తాయని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి జమ్ము అండ్ కశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో జరిగిన కర్లింగ్ పోటీల్లో స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బి. దీక్షిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాలికల విభాగంతో పాటు మిక్స్‌డ్ డబుల్ విభాగంలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించింది. అలాగే మరో విద్యార్థిని 9వ తరగతి విద్యార్థిని బి.హారిక మిక్స్‌డ్ డబుల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో విజేతలను అభినందించారు. వారికి శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరిన్ని పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న మండల పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి

కమలాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పందిళ్లపల్లె, పెద్దచెప్పలి పశు వైద్యాధికారులు మల్లికార్జున రెడ్డి, శివజ్యోతి తెలిపారు. సోమవారం తురకపల్లె, దాదిరెడ్డిపల్లెలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన పశువులకు వైద్యసేవలు అందజేశారు. అనంతరం పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కాగా తురకపల్లెలో 10 పశువులకు సాధారణ చికిత్సలు, 2 గర్భకోశ వ్యాధి చికిత్సలు, 75 పశువులతో పాటు 1,268 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును అందజేశారు. అలాగే దాదిరెడ్డిపల్లెలో 64 సాధారణ చికిత్సలు, 18గర్భకోశ చికిత్సలు, 12 చూడి నిర్ధారణ పరీక్షలు, 34 లేగ దూడలకు ఏలికపాము మందులు, 268 జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పశు వైద్య సిబ్బంది రుక్సానా, దుర్గా ప్రసాద్, కీర్తన, సుధాకర్, మౌనిక, రమేష్, సుబ్బు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి నల్లనమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వీరపునాయునిపల్లె: మండలంలోని కీర్తిపల్లె గ్రామంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు నల్లనమ్మ తిరునాల మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు గణపతి పూజ, జమ్మిచెట్టు పూజ, నాగదేవత పూజలతో కార్యక్రమాలతో తిరునాల ప్రారంభమవుతుందని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వందల అడుగుల ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తామని, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. తిరునాల మహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సింహాద్రిపురం : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 300 మంది పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ఎస్టీయూ ఏపీ అకడమిక్ కమిటీ తయారు చేసిన పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి అంగడి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌బాస్కర్‌రెడ్డి, జిల్లా అకడమిక్ కన్వీనర్ విజయవర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సోదరుడు మారెడ్డి మాధవరెడ్డి సౌజన్యంతో ఎంఈఓలు ఓబులేసు, ప్రభుదాస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ఎస్టీయూ తయారు చేసిన స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.